'స్వాతి' వారపత్రిక - 11-06-2004

# దెత్తి పుంత

కంపెనీ పనిమీద సింగపూర్ నుంచి హైదరాబాద్ వచ్చాను. ఓ మూడు రోజుల్లో అధికశాతం పని పూర్తయింది. హైదరాబాద్‌లోని ఓ సంస్థ ఏ నిర్ణయానికీ రావడానికి రెండు రోజులు గడువు అడిగింది. ఈ విషయం సింగపూర్‌లో ఉన్న మా అధికారికి చెప్పి, ఓ ఎక్స్‌ప్రెస్ రైలెక్కాను మా ఊరెళ్ళి అందర్నీ చూద్దామని.

నేను దిగవలసిన స్టేషను రాత్రి పన్నెండింటి కొచ్చింది. నేను దిగినది మూడో నెంబరు ప్లాట్‌ఫారం మీద. పట్టాలు దాటే కాలివంతెన ఎక్కడో దూరంగా ఉంది. వేలాది మైళ్ళు ప్రయాణంచేసి ఊరు చేరేసరికి ఇంటికి వెళ్ళే తహతహ అధికం కావడంతో, అడ్డంగా నడిచి రెండో నెంబరు ప్లాట్‌ఫారం అంచు చేరి, కిందకి దిగి నాలుగు పట్టాలు దాటి ఒకటో నెంబరు చేరాను. చేతిలో ఉన్న బ్రీఫ్‌కేసుని ముందుగా ప్లాట్‌ఫారం మీద పెట్టి, పైకి ఎక్కే ప్రయత్నంలో ఉండగా ఎవరో చెయ్యి అందించి పైకి ఊతాన్నిచ్చారు. నేను పైకి వెళ్ళి నిలదొక్కుకున్నానో లేదో, ఓ నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ దూసుకొని పోయింది. అటూ ఇటూ చూడకుండా పట్టాలు దాటిన నా నిర్లక్ష్య చర్య పెద్ద గండంగా మారేదే, ఆ వ్యక్తి చేయూత నివ్వకపోతే.

ఆయన రైల్వే రక్షకభటాధికారి దుస్తుల్లో ఉన్నాడు. మాట కూడదీసుకొని "థాంక్స్!" అన్నాను.

"థాంక్స్ మాట అటుంచండి. పట్టాలు దాటి వచ్చిన నేరానికి జుర్మానా చెల్లించి వెళ్ళాలి. నాతోరండి!" అన్నాడు నవ్వుతోనే. ఆయన్ని మారుమాట్లాడకుండా అనుసరించాను. ప్లాట్‌ఫారం చివరగా ఓ విశాలమైన గది.

'రైల్వే పోలీసు కంట్రోల్‌రూం' అని బయట గోడ మీద ఎర్రటి అక్షరాలతో రాయబడి ఉంది.

ఆయనతోబాటుగా లోపల అడుగు పెట్టాను. ఆయన వెళ్ళి ఓ బల్ల వెనుకనున్న కుర్చీలో కూర్చున్నాడు. బల్ల మీదనున్న త్రిభుజాకారపు 'నేమ్‌ప్లేట్' మీద ఎ.సూర్యారావు అన్న పేరు కనబడింది. ఆయన తొడుక్కున్న ఖాకీచొక్కా జేబుకి తగిలించిన నల్లటి 'ప్లాస్టిక్ స్ట్రిప్' మీద తెల్లటి అక్షరాలతో అదే పేరు. ఓపక్క గోడకాన్పిఉన్న ఓ పొడవాటి బల్ల మీద అరడజను వ్యక్తులు ఇరవై నుంచీ అరవై ఏళ్ళ వయసుల్లో ఉన్నవాళ్ళు కూర్చుని ఉన్నారు.

సూర్యారావుగారు బల్లసొరుగు లాగి, చలాన్ పుస్తకం పైకితీసి, కొన్ని పేజీలు తిప్పి, రెండు పేజీల మధ్య ఓ కార్బన్ కాగితముంచి, "మీ పేరూ, మీ తండ్రిగారి పేరూ చెప్పండి" అన్నాడు. నేను చెప్పిన పేర్లు రాసిన తర్వాత నాకేసి చూస్తూ, "రెండు వందలు చెల్లించండి" అన్నాడు మరోమారు. మారుమాట్లడకుండా చొక్కా జేబులో ఉన్న ఐదు వంద నోట్లలోంచి రెండు తీసి ఆయన ముందుంచాను.

ఆ సంఖ్య కూడా రాసి, ఫైడ్ అన్న రబ్బరు స్టాంప్ వేసి, ఆఫీస్ స్టాంప్ కూడా వేసి,

సంతకం చేసి పత్రున పై కాయితాన్ని చింపి నా చేతికందించాడు. నేను దాన్నోక్షణం పరిశీలించి చూసి మడిచి జేబులో పెట్టుకొన్నాను.

అప్పుడు బెంచీల మీద కూర్చున్న వ్యక్తుల్ని ఉద్దేశించి అన్నాడు – "మీరు చేసిన నేరమే ఈయనా చేశాడు. 'రూల్' ప్రకారం రెండు వందలూ వాదన చెయ్యకుండా చెల్లించాడు. చూసి బుద్ధితెచ్చు కోండి. జుర్మానా అయినా చెల్లించండి, లేదా పది రోజులు కటకటాల వెనక్కి వెళ్ళండి!"

అటుపైన మీరు వెళ్ళవచ్చునన్నట్లుగా నా వైపు చూశాడు.

థాంక్స్ చెప్పి, ప్లాట్‌ఫారం మధ్యవరకూ వెళ్ళి, స్టేషన్ నుంచి బైట పడ్డాను. నలుగురైదుగురు ఆటో డ్రైవర్లు చుట్టుముట్టారు.

"రంగరాజుపేట వెళ్ళాలి" అన్నాను.

"రంగరాజుపేటా?! మేం వచ్చేది లేదు సార్! ఊరికి మూడు కిలోమీటర్ల దూరం. అందులో రెండు వంతులు గతుకుల దారి. బ్రహ్మజెముడు డొంకల మధ్యనుంచీ, చింతతోపుల మధ్యనుంచీ పోవాలి. అక్కడక్కడా గోరీలూ, సమాధులూ దెయ్యాల్లా కనబడ్తాయి. మాలో ఇద్దరికి దెయ్యాలు కనబడ్డాయి కూడా. జడుపు జ్వరంతో వారం రోజులు మంచం పట్టేశారు! వాళ్ళిద్దరూ రాత్రి కాదు కదా పగలు కూడా అటువైపు బేరానకి పోరు!" అన్నాడో డ్రైవరు.

'చౌకగా స్థలాలు దొరుకుతున్నాయి – మనదీ అన్న ఇల్లు ఉంటే బావుంటుంది కదా?' అని నాన్నగారు ఉత్తరం రాస్తే మొత్తం సొమ్మంతా పంపించింది నేనే. ఐతే నాన్నగారు ఊరికింత దూరంలో ఇల్లు కట్టించారని ఊహించలేకపోయాను. డబ్బు కోసం ఆటో డ్రైవర్లు నాటక మాడ్తున్నారేమోనని, "మీరు మామూలుగా తీసుకొనే బాడుగ కంటే పదో, పదిహేనో ఎక్కువిస్తాను" అన్నాను.

"వందెక్కువిచ్చినా సరే అటువైపు వచ్చేది లేదు సార్!" అని అందరూ అక్కణ్ణుంచి జారుకొన్నారు.

"వాళ్ళందరూ పిరిగ్గొడ్లు! మిమ్మల్ని నా మోటారు సైకిలు మీద దిగబెడ్తాను"– వెనక నుంచి వచ్చిన మాటలతో తలతిప్పి చూశాను. సూర్యారావుగారు నవ్వుతూ కనిపించారు. మొహమాట పడ్తూనే 'సరే' నన్నట్లుగా తలూపాను. "మీరు మొహమాటపడ నవసరంలేదు. మీ కోసమని 'డిటూర్' చెయ్యవలసిన అవసరంలేదు. ఎందుకంటే నేనుండేదీ ఆ కాలనీలోనే. నాకు మీ నాన్నగారితో పరిచయముంది. అదీకాక మీ ఇల్లు తెలుసు, పదండి."

మారుమాట్లాడకుండా, ఆయన మోటారు సైకిలు 'స్టార్ట్' చెయ్యగానే వెనక ఎక్కి కూర్చున్నాను. కొద్దిసేపట్లోనే తారు రోడ్డు వదిలి, పుంతలాంటి ఓ రోడ్డులో ప్రవేశించాం. మొదటి కుదుపుతో సీటు పక్కనున్న 'హేండిల్ని' గట్టిగా పట్టుకొన్నాను. ఆయనా బండి వేగం బాగా తగ్గించేశాడు. మోటారుసైకిలు దీపకాంతి, చవితి చంద్రుని మసకవెన్నెలా తప్ప ఆ దారమ్మట దీపాలు లేవు.

ఓ వంద మీటర్లు వెళ్ళామో లేదో ఎడమ వైపు నుంచి ఓ స్త్రీ ఆర్తనాదం గట్టిగా వినిపించింది.

వెంటనే ఆయన బండి ఆపి, 'దిగండి' అన్నాడు. నేను దిగగానే ఆయన బండి దిగి, స్టాండ్ వేశాడు. 'బెల్ట్'కి తగిలించి ఉన్న టార్చి చేతిలోకి తీసుకొని, వెలిగించి పరుగెత్తాడు. ఆయన వెనుక బ్రీఫ్‌కేసు పట్టుకొని నేనూ పరుగెత్తాను.

కొంతదూరం పోయేసరికి శక్తివంతమైన టార్చి వెల్తుర్లో ఓ దృశ్యం కనబడింది. ఓ నడివయసు స్త్రీని ఎవరో బలాత్కారం చేస్తున్నారు. మరో ముగ్గురు తమ వంతు ఎపుడొస్తుందా అని ఎదురుచూస్తున్నట్టుగా నిల్చున్నారు. ఒక వ్యక్తి పక్కనే ఉన్న జువ్విచెట్టుకి తాళ్ళతో కట్టబడి, తన స్త్రీ మీద జరుగుతున్న అత్యాచారాన్ని చూడలేక కళ్ళు మూసుకొని ఉన్నాడు. సూర్యారావుగారు మెరుపు వేగంతో తన కుడిచేతిలోని టార్చిలైటుని ఎడంచేతిలోకి తీసుకొని, నడుం బెల్ట్‌కి తగిలించి ఉన్న తోలుసంచిలోంచి రివాల్వర్ తీసి, స్త్రీ మీద అత్యాచారం చేస్తున్న వ్యక్తి కాలి పిక్క మీద గురి చూసి కాల్చాడు. వాడు ఆక్రమించిన స్త్రీని వదిలి పక్కకి దొర్లి బాధతో అరవసాగాడు.

ఆ ముగ్గురు వ్యక్తులూ పలాయనం చిత్తగించారు. ఇదంతా క్షణాలలో జరిగిపోయింది. నేను పక్కనే కుప్పగా పడిఉన్న చీరని తీసి ఆమెపై కప్పాను. అటుతర్వాత వెళ్ళి జువ్విచెట్టుకు కట్టబడిన ఆ వ్యక్తిని బంధవిముక్తుణ్ణి చేశాను. సూర్యారావుగారు ఓ రెండు నిముషాలు టార్చి ఆర్పి మళ్ళీ వెలిగించాడు. ఆ లోపుగా ఆ స్త్రీ లేచి చీర ధరించింది. అవమానంతో ఏడుస్తోంది.

ఆ పురుషుణ్ణి చూస్తూ సూర్యారావుగారు గద్దింపు స్వరంతో అన్నారు– "చూడు ముసలయ్యా! నీ తాగుడు వ్యసనం ఎంతటి భయంకర పరిస్థితి తీసుకువచ్చిందో? నువ్వు తీర్చలేని బాకీ చెల్లింపుగా నువ్వు కట్టుకొన్న స్త్రీని నీ కళ్ళెదుటగానే మానభంగం చేశారు! అసలు తప్పంతా నీదే! నీ మొహం చూడ్డానిక్కూడా అసహ్యమేస్తోంది. రేపు ఉదయం ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కి రండి. వాళ్ళ మీద కేసు నమోదు చేయిస్తాను, పొండి!"

ఇద్దరూ నెమ్మదిగా నడుచుకొంటూ చెట్ల చీకట్లలో కలిసిపోయారు.

"ఈ గాయపడిన వెధవ పంచాయితీబోర్డు ప్రెసిడెంటు తమ్ముడు. సారా దుకాణాలనేకం నడుపుతాడు. మిమ్మల్ని దిగపెట్టి తిరిగివచ్చి వీడి సంగతి చూస్తాను. ఈలోపుగా వీడు పారిపోకుండా మరో 'డోసి'వ్వాలి అంటూ వంగి, బాధతో మూలుగుతున్న వాడి కణత మీద రివాల్వర్ తిరగేసి గట్టిగా కొట్టాడు. వాడు స్పృహ తప్పి పడిపోయాడు.

మళ్ళీ బయలుదేరి మరికొంత దూరం పోయేసరికి సూర్యారావుగారు బండి ఆపి, "దిగనవసరంలేదు. కుడివైపు చూడండి" అన్నారు.

చింతతోపుల మధ్యలో గాలికి ఊగే కొమ్మల మధ్య నుంచి దీపాలు కనబడ్డాయి.

"ఆ దీపాలు కనబడుతోన్నది ఓ ప్రతిపక్ష రాజకీయనాయకుడి బంధువు ఇల్లు. ఆ బంధువు ప్రభుత్వ పక్షంలో ఉన్న ఓ నేత వియ్యంకుడు! కోట్లాది విలువగల దొంగనోట్లు, నకిలీ స్టాంప్ పేపర్లు రాష్ట్రంలో చలామణి చేసే ఓ ముఖ్యమయిన కేంద్రం ఆ ఇల్లు. రెండేళ్ళ క్రితమే పోలీసులకి ఉప్పందించింది నేను. ఓ చిన్న సంచలనం రేగి అణగారిపోయింది. పాలకులూ, ప్రజా నాయకులూ, ప్రభుత్వోద్యోగులూ – ఆఖరికి పోలీసులూ శీతకన్ను వేసి కేసుని మూసిపెట్టడంతో, వ్యాపారం యధావిధిగా సాగిపోతోనే ఉంది!" అంటూ బండిని కదిలించారు.

దూరంగా వెలుగుతున్న వీధిదీపాలు కనబడ్డాయి. "రంగరాజుపేట వచ్చేశాం" అంటూ మొదటిఅడ్డసందు వదిలి, రెండో సందులోకి మలుపుతిప్పి లోనికిపోనిచ్చి, కుడిచేతి వైపునున్న ఓ గేటు ముందర నన్ను దింపి, నేను చెప్పిన థాంక్స్ అందుకొని వాళ్ళ ఇంటికి వీలుచూసుకొని రమ్మని ఆహ్వానించి కదిలిపోయాడు.

ఇంటికి ఎదురుగా ఉన్న వీధి దీపం వెల్తుర్లో గేటుకి తగిలించిన నాన్నగారి నేమ్‌ప్లేటూ, గేటు స్తంభం మీద కాలింగ్ బెల్లూ కనిపించాయి. కాలింగ్ బెల్ ఐదారుసార్లు నొక్కాక ముందు గదిలో లైటు వెలిగింది. కిటికీ తలుపు తీసి నాన్నగారు, "ఎవరూ?" అని ప్రశ్నించారు.

"నేనే, నాన్నగారూ!" అన్నాను, టెలిఫోనులో కాక ప్రత్యక్షంగా నాన్నగారి గొంతు నాలుగేళ్ళ తర్వాత విన్నానన్న ఆనందంతో. ఇంటిబైట లైటు వెలిగింది. ఆయన ముందు గది తలుపు తీసి బైటకువచ్చి, గేటు తాళం తీశారు. నేను పరుగుతో ముందుగదిలో ప్రవేశించి 'అమ్మా!' అని పిలిచాను. నాన్నగారితోబాటే నిద్ర లేచిన అమ్మ ముందు గదిలోకివచ్చి, సంభ్రమాశ్చర్యాలతో నన్ను అక్కున చేర్చుకొంది. నాన్నగారు గేటు తాళంవేసి వచ్చారు. లోపల్నించి తమ్ముడూ, చెల్లెలూ కూడా వచ్చి చేరారు.

"ఏం కృష్ణా! చెప్పా పెట్టకుండా వచ్చేశావు?! ఈ ఒక్క బ్రీఫ్‌కేసు తప్పా మరే సామాను లేదా? కబురుచేస్తే స్టేషన్‌కి స్కూటర్ మీద వచ్చేవాడినిగా. అవునూ ఇంతకూ స్టేషన్నుంచి ఎలా వచ్చావు? రాత్రివేళ ఆటో డ్రైవర్లు ఈ పేటకి రావడానికి మొరాయిస్తారు! నడిచి కాని రాలేదు కదా?" నాన్నగారు ప్రశ్నలు సంధించారు.

"అనుకోకుండా హైదరాబాద్ వచ్చి, వీలుచిక్కడంతో బయలుదేరాను. చెప్పకుండా వచ్చి మిమ్మల్ని 'సర్‌ప్రైజ్' చేద్దామనుకొని టెలిఫోన్ కూడా చెయ్యలేదు. మీరన్నట్లుగానే ఆటోడ్రైవర్లిక్కడికి రావడానికి తిరస్కరించారు. తను ఈ కాలనీలోనే ఉంటాననీ, మీరు తెల్సుననీ చెప్పి, సూర్యారావుగారనే రైల్వే పోలీసు ఇన్‌స్పెక్టర్ మోటారు సైకిల్ మీద దిగబెట్టి వెళ్ళారు" అన్నాను.

అమ్మ నేలమీద చతికిలబడిపోయింది. నాన్నగారు సోఫాలో కూలబడ్డారు. తమ్ముడు భయం భయంగా చూడసాగాడు. చెల్లెలు వసంత నా దగ్గరకు నెమ్మదిగా వచ్చి గిల్లి చూసింది. నా పాదాల వైపు చూసింది.

"నువ్వు దెయ్యానివి కావు. సూర్యారావుగారికి మన కుటుంబంతో పరిచయమున్న మాట వాస్తవమే! కాని ఆయన్ని, రెండేళ్ళ క్రితం కొన్ని కేసుల్లో ఆచూకీ అందించారన్న కసితో ఎవరో దుర్మార్గులు కాళ్ళూ చేతులూ కట్టి, రైలు పట్టాల మీద పడవేశారు. గూడ్సు ట్రైన్ చక్రాల కింద నలిగి ఆయన మరణించాడు!" అంది.

ఓ వణుకు శరీరాన్ని కుదిపివేసింది. నిభాయించుకొని జరిగింది యావత్తూపూస గుచ్చినట్టు చెప్పి, "కావాలంటే చూడండి, ఆయనిచ్చిన చలాన్" అని చొక్కా జేబులో చెయ్యి పెట్టి పైకి తీశాను. చలాన్ లేదు! అయిదు వంద నోట్లు పైకి వచ్చాయి! ఆశ్చర్యపోయాను.

ఉపసంహారం: ముసలయ్య భార్య మానభంగం జరిగిందీ రెండేళ్ళ క్రితమే, అప్పుడే వాళ్ళు ఆత్మహత్య చేసుకొన్నారు. అది జరిగి రెండేళ్ళయింది! నా కిప్పుడు దెయ్యాలంటే భయం లేదు. నైతిక విలువలు దిగజారిన సమాజ స్వరూపం చూసి మాత్రం భయం వేస్తోంది.